క్లుప్తంగా

పెండ్లికుమార్తెకు వితరణ



కడిమిశెట్టి వెంకటరత్నం కుటుంబ సభ్యులకు, నగదు, దుస్తులు, బంగారం అందజేస్తున్న చారిటీ గ్రూప్ సభ్యులు

విజయనగరం: పట్టణానికి చెందిన కడిమిశెట్టి వెంకటరత్నం కుమార్తె చంద్రకళ వివాహం నిమిత్తం జిల్లా ఆర్యవైశ్య మిత్రుల చారిటీ గ్రూప్ సభ్యులు రూ. 31 వేల నగదు, దుస్తులు సోమవారం అందజేశారు. అలాగే విశ్రాంత బ్యాంక్ ఉద్యోగి మాచర్ల చంద్రశేఖర్ గుప్తా పెండ్లి కుమార్తెకు బంగారు శతమానం అందించారు. ఈ సందర్భంగా గ్రూప్ అధ్యక్షుడు ఆలవెల్లి శేఖర్ మాట్లాడుతూ... విద్య, వివాహం, వైద్యం కోసం ఏ ఒక్కరూ ఇబ్బంది పడకుండా చారిటీ గ్రూప్ ద్వారా తగిన ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి డిమ్స్ రాజు, వాసవీ క్లబ్ అధ్యక్షుడు కందుల సంతోష్, సముద్రాల నాగరాజు, కుమార్, ఏవీ కృష్ణారావు, గుంపిన నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.

రాజారావు సేవలు వెలకట్టలేనివి



రాజారావు విగ్రహానికి పూల మాలవేస్తున్న రామకృష్ణ

విజయనగరం ఫోర్ట్: ఎస్సీల సంక్షేమం, ఐక్యత కోసం పాకా రాజారావు నిరంతర శ్రమించారని మాలహానాడు జిల్లా అధ్యక్షుడు లోగిశ రామకృష్ణ అన్నారు. దళిత నాయకుడు రాజారావు జయంతి సందర్భంగా రింగ్‌రోడ్డులో ఉన్న ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎస్సీల అభివృద్ధికి నిరంతరం పోరాటం చేశారన్నారు. అంబేడ్కర్ జంక్షన్‌లో అంబేడ్కర్ భవనం నిర్మాణానికి ప్రభుత్వాన్ని ఒప్పించారని తెలిపారు. 200 అంబేడ్కర్ విగ్రహాల స్థాపనకు కృషి చేసారన్నారు. కార్యక్రమంలో దుర్గాప్రసాద్, శంకరరావు, పైడితల్లి, మనోహర్, తదితరులు పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలు తప్పనిసరి

విజయనగరం పూల్‌బాగ్: విజయనగరం యూత్ హాస్టల్‌లో ఆఫీస్ బేరర్స్ శిక్షణ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్టేట్ కోఆర్డినేటర్ టి. రమేష్ మాట్లాడుతూ, చదువుకునే వయసు నుంచే నాయకత్వ లక్షణాలు కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కో ఆర్డినేటర్ ఎస్. వరప్రసాద్, జిల్లా టీమ్ మెంబర్ ఎస్. కాలిబాబు, తదితరులు పాల్గొన్నారు.

నేడు 'గడప గడపకు మన ప్రభుత్వం' 250వ రోజు

కొత్తవలస: మండలంలోని సంతపాలెం గ్రామంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం మంగళవారం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 250వ రోజు కావడంతో కార్యక్రమాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించ నున్నట్లు పేర్కొన్నారు. నియోజకవర్గంలోని ముఖ్యనాయకులు, కార్పొరేషన్‌ల చైర్మన్‌లు, డైరెక్టర్లు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు జేసీఎస్ ఇన్‌చార్జ్‌లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు హాజరు కావాలని కోరారు.

వాహన తనిఖీలు



వాహన తనిఖీలు చేస్తున్న సీఐ చంద్రశేఖర్

కొత్తవలస: స్థానిక మూడురోడ్ల జంక్షన్‌లో సీఐ వి.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పోలీసులు సోమవారం వాహన తనిఖీలు నిర్వహించారు. ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. సీఐ మాట్లాడుతూ అరకు నుంచి గంజాయి తరలించే అవకాశం ఉన్నందున ప్రత్యేక నిఘా పెట్టామని చెప్పారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపినా, మైనర్లకు వాహనాలు ఇచ్చే యజమానులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎస్ఐ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పరిశీలన



మొక్కలను పరిశీలిస్తున్న ఏపీఓ పెద్దఅప్పలనాయుడు

మెరకముడిదాం: ఉపాధి హామీ పథకంలో భాగంగా మండలంలోని ఊటపల్లి, కొమ్మాని వలస గ్రామాల రోడ్డుకు ఇరువైపులా ఇటీవల నాటిన మొక్కలను ఉపాధి హామీ ఏపీఓ ఎస్. పెద్దఅప్పలనాయుడు సోమవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన వేతనదారులతో మాట్లాడుతూ నాటిన 600 మొక్కల్లో ఒక్కమొక్క కూడా చనిపోకుండా పెంచాలని సూచించారు. టెక్నికల్ అసిస్టెంట్ ఎల్లయ్య, క్షేత్రసహాయకుడు పాల్గొన్నారు.

నమ్మకమైన వైద్యం..

- సర్వజన ఆస్పత్రిలో క్రిటికల్ కేసులకూ సత్వర చికిత్స
- వెంటిలేటర్ సౌకర్యంతో 30 పడకల ఐసీయూ వార్డు ఏర్పాటు
- 24 గంటలూ వైద్యసేవలు
- పెరిగిన రోగుల తాకిడి



ఐసియులో వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్న రోగులు

విజయనగరం ఫోర్ట్: జిల్లా కేంద్రంలోని సర్వజన ఆస్పత్రిలో మెరుగైన సేవలు అందుతున్నాయి. క్రిటికల్ కేసులకు కూడా వైద్యసేవలు అందిస్తుండడంతో రోగులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గతంలో జిల్లా ఆస్పత్రిగా ఉన్న సమయంలో ఎక్కువగా కేసులను విశాఖ కేజీహెచ్‌కు రిఫర్ చేస్తారనే అపవాదు ఉండేది. సర్వజన ఆస్పత్రిగా మారిన తర్వాత పరిస్థితి అందుకు భిన్నంగా మారింది. అత్యవసర కేసులు అన్నింటికీ ఇక్కడే వైద్య సేవలు అందుతున్నాయి. అదే విధంగా పీహెచ్‌సీ, సీహెచ్‌సీ, ప్రాంతీయ ఆస్పత్రుల నుంచి వస్తున్న రోగులకు సైతం ఇక్కడ మెరుగైన సేవలందిస్తున్నారు.

వెంటిలేటర్స్‌తో చికిత్స..

గతంలో వెంటిలేటర్స్ లేక పోవడం వల్ల ఇటువంటి చికిత్స కోసం వచ్చే రోగులను కేజీహెచ్‌కు రిఫర్ చేసేవారు. కాని ఇప్పుడు వెంటిలేటర్‌పై చికిత్స సర్వజన ఆస్పత్రిలోనే అందుతోంది. ఆస్పత్రిలో ఆక్సిజన్, వెంటిలేటర్‌తో 30 పడకల ఐసీయూ అందుబాటులోకి వచ్చింది.

ఐసీయూలో చికిత్స అందించేది వీరికే..

శ్వాస ఆడని వారికి, శస్త్రచికిత్స అయిన రోగులకు, పాముకాటు బాధితులకు, పక్షవాతం బారిన పడిన వారికి, ఊపిరితిత్తుల వ్యాధిగ్రస్తులు, విషం తీసుకుని అపస్మారక స్థితిలో ఉన్న వారికి , ఆత్మహత్యయత్నానికి పాల్పడి ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి చికిత్స అందిస్తారు.

మానసిక రోగులు, డ్రగ్స్‌కు అలవాటు పడినవారికి ప్రత్యేక వార్డు..

ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో మానసిక రోగులు స్త్రీ, పురుషులకు వేర్వేరుగా ప్రత్యేక వార్డులు ఏర్పాటు చేశారు. అదేవిధంగా గంజాయి, కొక్త్రైన్, హైరాయిన్, బ్రౌన్ సుగర్, డ్రగ్ ఇంజెక్షన్లు వంటి వాటికి అలవాటు పడ్డవారికి కూడా చికిత్స అందిస్తున్నారు.

రోగుల తాకిడి..

ఆస్పత్రిలో సాధారణ చికిత్సలతో పాటు అత్యవసర సేవలు అందుబాటులోకి రావడంతో ఆస్పత్రికి వచ్చే రోగుల సంఖ్య పెరిగింది. ఔట్ పేషెంట్ సేవలతో పాటు, ఇన్ పేషెంట్ సేవలు కూడా పెరిగాయి. గతంలో ఔట్ పేషెంట్లు 500 నుంచి 600 మంది వచ్చేవారు. ఇప్పుడు రోజుకు 800 నుంచి 1000 మంది వరకు ఔట్ పేషెంట్లు వస్తున్నారు. అదేవిధంగా ఇన్ పేషెంట్లు గతంలో రోజుకి 50 నుంచి 60 మంది చేరితే ఇప్పుడు 80 నుంచి 100 మంది వరకు చేరుతున్నారు. గతంలో పలమనాలజీ సేవలు లేక పోవడంతో ఈ సేవలు కోసం రోగులు ప్రైవేట్ ఆస్పత్రిలో చేరేవారు. ఇప్పుడు ఆస్పత్రిలో పలమనాలజీ సేవలు అందుబాటులోకి రావడంతో ఈ విభాగానికి కూడా రోజుకి 50 నుంచి 60 మంది రోగులు వస్తున్నారు.

ఆధునాతన శస్త్రచికిత్సలు..

ఆస్పత్రిలో ఎముకలు, జనరల్ సర్జరీ, ఈఎన్‌టీ, డెంటల్, తదితర శస్త్రచికిత్సలు చేస్తారు. ఆయా విభాగాల్లో క్రిటికల్ శస్త్రచికిత్సలుసైతం చేస్తున్నారు. అంతే కాకుండా కార్పొరేట్ ఆస్పత్రుల్లో నిర్వహించే ఆధునాతన శస్త్రచికిత్సలు సైతం ఇక్కడ జరుగుతున్నాయి. 24 గంటల పాటు రోగులకు వైద్య సేవలు అందడంతో రిఫరల్స్ కూడా తగ్గాయి.



పక్క ఫొటోలో కనిపిస్తున్న యువతి పేరు మహాలక్ష్మి. ఈమెది గజపతి నగరం గ్రామం. తీవ్ర రక్తహీనతతో కొద్ది రోజుల కిందట ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో చేరింది. 3.8 గ్రాముల హెచ్‌బీతో (హిమోగ్లోబిన్) నడవలేని స్థితిలో ఉన్న ఆమెను కుటుంబ సభ్యులు సర్వజన ఆస్పత్రిలో చేర్పించగా.. ప్రస్తుతం ఆమె కోలుకుంటోంది.



పక్క ఫొటోలో కనిపిస్తున్న వద్దురాలి పేరు కె. రాధ. ఈమెది విశాఖపట్నం జిల్లా అనంతగిరి ప్రాంతం . పాము కాటు వేయడంతో ఈనెల 4వ తేదీన అనంతగిరి ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం ఎస్. కోట ప్రాంతీయ ఆస్పత్రికి రిఫర్ చేశారు. అక్కడ కొద్ది రోజుల చికిత్స అనంతరం ఈనెల 5న ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో చేర్పించారు. వైద్యులు ఆమెకు మెరుగైన చికిత్స అందించడంతో ప్రస్తుతం ఆమె కోలుకుంది.

మెరుగైన వైద్యం..

ఆస్పత్రికి వచ్చిన వారందరికి మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నాం. అత్యవసర సేవలు కూడా 24 గంటల పాటు అందిస్తున్నాం. రోగుల సంఖ్య కూడ పెరిగింది. వైద్య సిబ్బంది అంకిత భావంతో పనిచేస్తున్నారు. అన్ని రకాల అత్యవసర కేసులకు చికిత్స అందిస్తున్నాం.

– డాక్టర్ పీపీ రమణి, ఇన్‌చార్జ్ సూపరింటిండెంట్, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి

వాకర్స్ క్లబ్‌లు సేవలకు ప్రతిరూపం



సమావేశంలో మాట్లాడుతున్న వాకర్స్ గవర్నర్ కర్రోతు సత్యం

విజయనగరం: వాకర్స్ క్లబ్‌లు సేవాతత్పరతకు ప్రతిరూపంగా నిలవాలని వాకర్స్ గవర్నర్ కర్రోతు సత్యం అన్నారు. సోమవారం ఉదయం స్థానిక కంటోన్మెంట్ రైతుబజార్ వద్ద ఉన్న ఆఫీసర్స్ క్లబ్‌లో తొష్నివాల్ వాకర్స్ క్లబ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నడక ప్రాముఖ్యతపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఏర్పాటైన వాకర్స్ క్లబ్బులు ఆయా ప్రాంతాలలో చేపడుతున్న సేవా కార్యక్రమాల ద్వారా ప్రజలకు మరింత చేరువయ్యాయన్నారు. డిప్యూటీ గవర్నర్ ముళ్లపూడి సుభద్రాదేవి మాట్లాడుతూ, వాకర్స్ క్లబ్ సేవా క్యాలెండర్లో పేర్కొన్న ప్రతి కార్యక్రమాన్ని నిర్వహించడం ద్వారా ఈ ఏడాది సేవలలో ముందు నిలిచిందని ప్రశంసించారు. అనంతరం వాకర్స్ డిప్యూటీ గవర్నర్ ముళ్లపూడి సుభద్రాదేవితో పాటు ప్రముఖ రచయిత్రి చివుకుల శ్రీలక్ష్మిని క్లబ్ ప్రతినిధులు సత్కరించారు. కార్యక్రమంలో క్లబ్ పూర్వపు గవర్నర్ ఫోర్‌ఎస్ రాజు, కొత్తిలి ఎర్నాయుడు, శ్రీరామమూర్తి, పప్పు విశ్వనాథం, సీహెచ్ మోహనరావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని తంగుడుబిల్లి జంక్షన్ వద్ద పలు కళాశాలల విద్యార్థులు సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఆర్టీసీ బస్సుకు అడ్డంగా స్టాపర్లు పెట్టి బస్సును నిలిపివేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ, బస్సు నిండిపోవడంతో ఆయా జంక్షన్ల వద్ద బస్సు ఆపడం లేదని, దీంతో కళాశాలలకు వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్నామన్నారు. బస్‌పాస్ ఉన్న విద్యార్థులు అధికంగా ఉన్నప్పటికీ ఒక బస్సు మాత్రమే ఉదయం సేవలందిస్తోందని, బస్సు సరిపడక సకాలంలో కళాశాలలకు వెళ్లలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. నెల్లిమర్ల – రణస్థలం రహదారిలో మరో రెండు బస్సులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

మళ్లీ వైఎస్సార్‌సీపీదే విజయం

- ఎమ్మెల్యే అప్పలనరసయ్య



విజయం సాధించిన వారితో ఎమ్మెల్యే అప్పలనరసయ్య, తదితరులు

గజపతినగరం: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మళ్లీ వైఎస్సార్‌సీపీ విజయం తథ్యమని,ఇటీవల రాష్ట్రంలో జరిగిన పంచాయతీల ఉపఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతుదారుల ఏకపక్ష విజయాలే అందుకు నిదర్శనమని గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. విజయం సాధించిన అభ్యర్థులతో కలిసి స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి రోజురోజుకూ ప్రజాదరణ పెరుగుతోందన్నారు. ఆయన పరిపాలనను మెచ్చి పంచాయతీ ఉపఎన్నికల్లో సర్పంచ్‌లు, వార్డు మెంబర్లుగా వైఎస్సార్‌సీపీ మద్దతుదారులను గెలిపించారని అన్నారు. ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో ఆరు సర్పంచ్ స్థానాలకు ఎన్నికలు నిర్వహించగా వీటిలో ఒకటి వైఎస్సా ర్‌సీపీ మద్దతుదారు ఏకగ్రీవంగా గెలుచుకోగా, మిగతా అయిదు స్థానాల్లో నాలుగు చోట్ల వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు విజయం సాధించిన విషయాన్ని గుర్తు చేశారు. వార్డు మెంబర్ల ఎన్నికల్లో నూ వైఎస్సార్‌సీపీ మద్దతుదారులే అధికశాతం గెలిచారన్నారు. ఉప ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయ దుందుభి మోగిస్తే, ఎల్లోమీడియా, కొన్ని పత్రికలు మాత్రం టీడీపీ హవా అని తప్పుడు కథనాలు, రాతలు రాయడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. గెలిచే సత్తా లేక టీడీపీ నాయకులు టీవీ ఛానెళ్లు, పేపర్లను అడ్డం పెట్టుకొని తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు నియోజకవర్గం కుప్పంలో ఆరు స్థానాల్లో వార్డు మెంబర్ స్థానాలకు పోటీ జరగగా, అయిదు స్థానాల్లో వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు విజయం సాధించారని, ఇది ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనపై ప్రజలకు ఉన్న నమ్మకమని అన్నారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు నారాయణమూర్తి రాజు, జెడ్పీటీసీ గార తవుడు, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు బూడి వెంకటరావు, పార్టీ నాయకులు బెల్లాన త్రినాథరావు, మండల సురేష్, కనకల సుబ్రహ్మణ్యం, మంత్రి అప్పలనాయుడు, బైరెడ్డి శ్రీను, సామంతుల పైడిరాజు, రేగ సురేష్, కె.ఆదినారాయణ పాల్గొన్నారు.

పాఠశాలకు కుర్చీల వితరణ



హెచ్‌ఎంకు కుర్చీలు అందజేస్తున్న కళాశాల సాధన కమిటీ సభ్యులు

జామి: మండల కేంద్రంలో జూనియర్ కళాశాల ఏర్పాటుకు ఎనిమిదేళ్ల క్రితం కళాశాల సాధన కమిటీ కార్పస్‌ఫండ్ నిమిత్తం రూ.5.27లక్షలు సేకరించింది. వాటిని బ్యాంకులో డిపాజిట్ చేయగా, ఆమొత్తంపై వడ్డీ లక్ష రూపాయలు వచ్చింది. ఈ మొత్తాన్ని విద్యాభివృద్ధి కార్యక్రమాలకు వినియోగిస్తున్నామని కమిటీ సభ్యులు తెలిపారు. ఈ నిధుల్లో రూ.5 వేలుతో కుర్చీలు కొనుగోలు చేసి స్థానిక ఉన్నతపాఠశాలకు సోమవారం అందజేశారు. కమిటీ సభ్యులు మాట్లాడుతూ పదోతర గతిలో ప్రతిభ కనబరిచిన నలుగురు విద్యార్థులకు ఒకొక్కరికీ రూ.3 వేల చొప్పున ఇటీవల అందజేశామని చెప్పారు. తల్లిదండ్రులులేని 13 మంది విద్యార్థులకు రూ.2,500 చొప్పున రూ.32,500,పాఠశాలకు జిమ్ పరికరాలు , స్థానిక గ్రంథాలయ మరమ్మతులకు రూ.30 వేలు అందించినట్లు తెలిపారు. హెచ్‌ఎం అబ్దుల్ రెహమాన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సెప్టెంబర్ 9న లోక్‌అదాలత్



మాట్లాడుతున్న జడ్జి కనకలక్ష్మి

గజపతినగరం: వచ్చే నెల 9వ తేదీన నిర్వహించనున్న జాతీయ లోక్‌అదాలత్ కార్యక్రమాన్ని న్యాయవాదులు, పోలీసులు విజయవంతం చేయాలని స్థానిక ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ సివిల్ కోర్టు జూనియర్ జడ్జి బి.కనకలక్ష్మి కోరారు. కోర్టులో సోమవారం న్యాయవాదులు, పోలీసులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ రాజీకాదగని కేసుల ను లోక్‌అదాలత్‌లో పరిష్కరించుకునేలా కక్షిదారులకు అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో చాలామంది చిన్నచిన్న విషయాలకు తగాదాలను పెంచుకొని కోర్టుల చుట్టూ, పోలీసుల చుట్టూ తిరుగుతూ కాలాన్ని, డబ్బును వృథా చేసుకుంటూ ఉంటారని, అటువంటి వారికి లోక్‌అదాలత్‌లో రాజీమార్గం ఉంటుందని చెప్పాలని సూచించారు.

వైద్యరంగానికి పెద్దపీట

- ఎంపీపీ మహంతి కల్యాణి



ల్యాబ్, డయాగ్నస్టిక్ సెంటర్ నూతన భవన నిర్మాణాలకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ మహంతి కల్యాణి

భోగాపురం (పూసపాటిరేగ): పేద ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వైద్యరంగానికి పెద్దపీట వేస్తోందని ఎంపీపీ మహంతి కల్యాణి అన్నారు. పూసపాటిరేగ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం వద్ద సుమారు రూ.50 లక్షల నిధులతో నిర్మించబోయే ల్యాబ్, డయాగ్నస్టిక్ సెంటర్ భవనాలకు ఎంపీపీ కల్యాణి సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్రంలో విలేజ్ హెల్త్‌క్లినిక్‌లను ఏర్పాటు చేసి వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చి పేద ప్రజలకు ఉచిత వైద్యాన్ని అందిస్తున్నారని చెప్పారు. అంతేకాకుండా ప్రజలకు ఇంటి వద్దే వైద్యారోగ్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ప్రారంభించారన్నారు. కార్యక్రమంలో జేసీఎస్ మండల కన్వీనర్ మహంతి శ్రీనివాసరావు, సర్పంచ్ సీతారాం, వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలి



నిరసన తెలియజేస్తున్న తపాలాశాఖ ఉద్యోగులు

విజయనగరం టౌన్: తపాలాశాఖలో నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని తపాలా శాఖ ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం సాయంత్రం స్థానిక జిల్లా తపాలా శాఖ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగులు మాట్లాడుతూ, కేంద్రప్రభుత్వం తపాలాశాఖలో నూతన పెన్షన్ విధానాన్ని తీసుకురావడం సరికాదన్నారు. పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరణ విధానంలో భాగంగా తీసుకువస్తున్న నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేయకపోతే పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ధర్నాలో సంఘం అధ్యక్షుడు వి.శ్రీనివాసరావు, సంఘ నాయకులు కె.నారాయణరావు, రుద్రప్రతాప్, పెంట పాపయ్య, తదితరులు పాల్గొన్నారు.

గోవులను రక్షించాలి



ఎస్పీ దీపికకు వినతిపత్రం అందజేస్తున్న గో సంరక్షణ సమాఖ్య ప్రతినిధులు

విజయనగరం క్రైమ్: గోమాతలకు రక్షణ కల్పించేలా చర్యలు చేపట్టాలని జిల్లా బ్రాహ్మణ సంక్షేమ సేవా సంఘాల సమాఖ్య ప్రతినిధులు, అర్చక పురోహిత సంఘాల ప్రతినిధులు కోరారు. ఈ మేరకు ఎస్పీ దీపికాపాటిల్‌ను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రతినిధులు మాట్లాడుతూ, కొండవెలగాడ వద్ద గోశాలను నిర్మించి, రోడ్లపై తిరుగుతున్న గోవులను తక్షణమే అక్కడకు తరలించాలని కోరారు. గోవధను నిషేధించినప్పటికీ ఇంకా అది నిరాటంకంగా కొనసాగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. పశువుల అక్రమ రవాణా, గోవధను నిరోధించేందుకు ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ విషయమై ఇప్పటికే డీఆర్‌ఓ గణపతిరావుకు వినతిపత్రం అందజేశామన్నారు. కార్యక్రమంలో సమాఖ్య ప్రతినిధులు టీవీ.శ్రీనివాసరావు, భమిడిపాటి రామ్‌కుమార్, గన్నవరపు శ్రీనివాస్, మంత్రిప్రగడ రవికుమార్, కేజే శర్మ, అల్లంరాజు కామేశ్వర శర్మ, రామాయణం సత్యనారాయణ, బి.సన్యాసిరాజు, చామర్తి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

చలో విజయవాడను విజయవంతం చేయండి



ర్యాలీని ప్రారంభిస్తున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి సురేష్



మాట్లాడుతున్న జగన్ మోహనరావు

నెల్లిమర్ల రూరల్: ఏపీ మున్సిపల్, వర్కర్స్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో చేపట్టనున్న చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ సంఘ జిల్లా నాయకుడు జగన్ మోహనరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు పట్టణంలో సోమవారం బైక్‌ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఈ నెల 24న చేపట్టనున్న చలో విజయవాడ కార్యక్రమానికి కార్మికులందరూ హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో నేతలు బాబూరావు, హరి, తదితరులు పాల్గొన్నారు.

24న చలో విజయవాడ

విజయనగరం పూల్‌బాగ్: మున్సిపల్ కార్మికులకు ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ ఈనెల 24న చలో విజయవాడ కార్యక్రమం నిర్వహించనున్నట్లు సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె. సురేష్ తెలిపారు. ఈ మేరకు కార్పొరేషన్ కార్యాలయం వద్ద సోమవారం ఉదయం బైక్ ర్యాలీ ప్రారంభించారు. అనంతరం మున్సిపల్ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎ. జగన్ మోహనరావుతో కలిసి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో తీవ్ర నిర్లక్ష్యం చేస్తోందన్నారు. మధ్యవర్తులు లేని వ్యవస్థను తీసుకొస్తానని ఆప్కోస్‌ను ఏర్పాటు చేసిందని, రాష్ట్రంలో అన్ని కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో పంపుహౌస్ కార్మికులను ఆప్కోస్‌లో చేర్చారని, అయితే విజయనగరంలో మాత్రం కాంట్రాక్టర్ వ్యవస్థను కొనసాగిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామికి, కలెక్టర్‌కు వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నగర ఉపాధ్యక్షుడు రెడ్డి శంకరరావు, మున్సిపల్ యూనియన్ నాయకుడు రాఘువ, కార్మికులు గంగయ్య, మణికంఠ , శ్రీను, నారాయణ, రామ్మోహనరావు, చెల్లయ్య , గౌరి, గోవిందరావు, రాము, ఈశ్వరరావు, కృష్ణ, లక్ష్మీనారాయణ, అప్పలస్వామి పాల్గొన్నారు.